సాక్షి వరంగల్

శనివారం । 27 । జనవరి । 2024



16 కిలోల గంజాయి స్వాధీనం

కాజీపేట రైల్వే జంక్షన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తి వద్ద 16కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. - 8లో▸



నేటి నుంచి అన్నారం దర్గా ఉర్సు

పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్‌లో దర్గా ఉర్సు శనివారం ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు వేలాది మంది భక్తులు తరలివస్తారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$32^0/17^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం చలితోపాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రివేళ పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

బాలకిశోర్‌రెడ్డి సేవలు అభినందనీయం

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ: కాంగ్రెస్ జిల్లా నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి సేవలు అభినందనీయమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లలో బాలకిశోర్‌రెడ్డి నిర్వహించిన క్రీడాపోటీల విజేతలకు శుక్రవారం నగదు బహుమతులు పంపిణీ చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. గీసుకొండ జాతర సందర్భంగా లక్ష్మీనర్సింహ స్వామిని సందర్శించి మొక్కులు సమర్పించారు. తర్వాత దస్రుతండాలో కిశోర్‌రెడ్డి సహకారంతో బాధితులకు సాయం అందించారు. నాయకులు అల్లం మర్రెడ్డి, ఎంపీపీ భీమగాని సౌజన్య, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పర్వతగిరి: మండలంలోని అన్నారం గ్రామంలో శుక్రవారం రాత్రి బెల్ట్‌షాపుపై దాడులు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఏఎస్సై యాదగిరి, కానిస్టేబుళ్లు రమణ, రాజు అన్నారం గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహించారు. గ్రామ శివారులోని మహ్మద్ పాషాకు చెందిన బెల్ట్ షాపులో దాడులు చేసినట్లు ఆయన తెలిపారు. రూ.31,860 విలువ చేసే మద్యం బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు సెమినార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, తెలంగాణ ప్రభుత్వ ఈఎఫ్ అండ్ టీ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా ఈనెల 27న 'ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ కెరీర్స్ ఇన్ ఐపీఆర్ అవేర్‌నెస్' అంశంపై సెమినార్ నిర్వహించనున్నారు. పరిపాలనా భవనం సెనేట్‌హాల్‌లో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సెమినార్‌లో కేయూ వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు పాల్గొంటారు. 'ఇంపార్టెన్స్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైన్ ఫర్ అకాడమీ' అంశంపై హెడ్ లీగల్ అండ్ ఐపీఆర్ సుభాజిత్‌సాహా ప్రసంగిస్తారు.

దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలి



హన్మకొండ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రమాదానికి పాల్పడిన డ్రైవర్లపై విధించిన శిక్షకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న తలపెట్టిన దేశ వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ అనుబంధ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి.రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఆర్టీసీ కార్మికుల సమస్యలపై అధ్యయనం చేసేందుకు హనుమకొండకు గురువారం ఆయన వచ్చారు. వరంగల్-1, వరంగల్-2, హనుమకొండ డిపోల్లో పర్యటించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ పనిభారం పెరిగిందని, ఇష్టానుసారంగా బస్ షెడ్యూల్ నిర్ణయిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని కార్మికులు తెలిపినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన అనేక హామీలు నెరవేరలేదని, రెండు పీఆర్‌సీలు అమలు చేయాల్సి ఉండగా ఇప్పటికీ దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో ప్రయాణికుల సంఖ్య పెరిగి కార్మికులపై భారం పడుతున్నదని చెప్పారు. రెండు వేతన సవరణలు చేయాలని, పని భారం తగ్గించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధ్యయనం చేసిన కార్మికుల సమస్యలను పుస్తకం రూపంలో తీసుకురానున్నట్లు వివరించారు. కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ అధ్యక్షుడు చింత రాంచందర్, కార్యదర్శి టి.ఎల్లయ్య, కోశాధికారి ఎస్.శ్రీనివాసులు, వరంగల్-1, 2, హనుమకొండ డిపోల అధ్యక్ష, కార్యదర్శులు జి.వైగిరి, బీయూ.చారి, రమణ, వై.శ్రీనివాస్, పి.కృష్ణమూర్తి, పి.మహేందర్, కార్మికులు పాల్గొన్నారు.

భారతీయులంతా ఒక్కటే..

కాజీపేట రూరల్: భారతీయులంతా ఒక్కటే.. ఐక్యత చాటి దేశాభివృద్ధికి తోడ్పడాలని రైల్వే ఎలక్ట్రిక్ షెడ్ సీనియర్ డీఈఈ, ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ ప్రశాంత్‌కృష్ణసాయి అన్నారు. కాజీపేట రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఆయన త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం ఇటీవల నిర్వహించిన క్రికెట్ పోటీల విజేతలకు రైల్వే కమ్యూనిటీహాల్‌లో డీజిల్‌షెడ్ సీనియర్ డీఎంఈ స్వరాజ్‌కుమార్‌తో కలిసి బహుమతులు ప్రదానం చేశారు. సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, మజ్దూర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం



జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్



స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆరు గ్యారంటీలతో పేదల సంక్షేమం

- రూ.93 కోట్లతో నర్సంపేట మున్సిపాలిటీ అభివృద్ధి
- రూ.80 కోట్లతో సమీకృత కలెక్టరేట్ నిర్మాణం
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు
- జిల్లాలో 1,26,568 మందికి ఆసరా పింఛన్ల పంపిణీ
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ ప్రావీణ్య

ఖిలా వరంగల్ : జిల్లా సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. ఖిలా వరంగల్ మధ్యకోటలోని ఖుష్‌మహల్ మైదానంలో శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ జాతీయ జెండాను ఎగురవేసి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆరు గ్యారంటీ పథకాలను అర్హులకు అందజేస్తామని తెలిపారు. మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని, ఈ పథకం ద్వారా 45 శాతం ప్రయాణికుల సంఖ్య పెరిగిందని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పథకంతో రూ.10 లక్షల విలువైన వైద్యసేవలు అందిస్తున్నామని చెప్పారు.

- డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు జిల్లాలో 391 ప్రజాపాలన సభలు నిర్వహించి 2,89,960 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.
- గ్రామీణ పేదరిక నిర్మూలన పథకం కింద జిల్లాలో ప్రతినెల రూ.28.70 కోట్లు వెచ్చించి 1,26,568 మందికి పింఛన్లు అందిస్తున్నామని వెల్లడించారు.
- ఉపాధి హామీ పథకం కింద 69,497 మంది కూలీలకు 15 లక్షల పనిదినాలు కల్పించి రూ.26 కోట్ల వేతనం అందించామన్నారు.
- జిల్లాలో 2,66,679 మంది లబ్ధిదారులకు 509 రేషన్ షాపుల ద్వారా నెలనెలా 49,782 క్వింటాళ్ల బియ్యం ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు.
- ఎస్సారెస్పీ స్టేజ్-1 ద్వారా 70,739, స్టేజ్-2 ద్వారా రెండు సీజన్లకు 22,045 ఎకరాలకు, పాకాల చెరువు నుంచి 18,193 ఎకరాలకు సాగు నీరు అందించామని తెలిపారు. చిన్న నీటి పారుదల శాఖ ద్వారా 815 చెరువుల కింద ఖరీఫ్‌లో 65,695 ఎకరాలు, రబీలో 45 వేల ఎకరాలకు సాగునీరు అందించామని వెల్లడించారు. రూ.14.85 కోట్ల వ్యయంతో 8 చెక్‌డ్యాంలు నిర్మించామని వివరించారు.
- జిల్లాలోని 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 7 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఎంజీఎం, సీకేఎం, నర్సంపేట, వర్ధన్నపేట ఆస్పత్రులు, 118 ఆరోగ్య ఉపకేంద్రాలు, 82 పల్లెదవాఖానలు ప్రతిరోజు 4 లక్షల మందికి వైద్య సేవలు అందిస్తున్నాయని తెలిపారు. ఎంజీఎంలో రూ.12 కోట్ల వ్యయంతో హీలియం రహిత ఎంఆర్‌ఐ స్కానింగ్ యంత్రం, చిన్నపిల్లలకు డయాబెటిక్ వార్డు ఏర్పాటు చేసినట్లు వివరించారు. బైపాస్ సర్జరీస్, స్టంట్స్, యాంజియోగ్రామ్, డయాలసిస్ సేవలు, ఖరీదైన క్లీయర్ ఇంప్లాంట్ సర్జరీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.
- నగరంలో రూ.80 కోట్ల వ్యయంతో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.
- జిల్లాలోని 3 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఉన్న 919 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సేవలందుతున్నాయని తెలిపారు.72 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేశామని, సఖి సెంటర్ ద్వారా 901మంది బాధితులను రక్షించామని తెలిపారు.
- జిల్లాలోని 645 ప్రభుత్వ పాఠశాలలు, 6 ఆదర్శ, 10 కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలల ద్వారా 1,29,070 మంది విద్యార్థులకు మెనూ ప్రకారం సన్నబియ్యంతో పౌష్టికాహారం అందిస్తున్నాం. 2,94,062 పాఠ్యపుస్తకాలు అందజేశామని, టెన్త్ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు.
- 798 మంది రైతులను ఎంపిక చేసి 1,818 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటించినట్లు తెలిపారు. 1,320 ఎకరాల్లో ఉద్యాన పంటలు వేసినట్లు పేర్కొన్నారు.
- 323 గ్రామ పంచాయతీల్లోని 4,60,504 మంది జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు.
- వరంగల్ మహానగరపాలక సంస్థ పరిధిలో 2014 నుంచి రూ.346 కోట్లతో 3,234 అభివృద్ధి పనులు చేపట్టగా..రూ.273 కోట్ల వ్యయంతో 2,880 పనులు పూర్తిచేశామని తెలిపారు. 124 అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయని, 2020 నుంచి 2023 వరకు అందరికృషి ఫలితంగా ఓడీఎఫ్‌లో చోటు దక్కిందన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో దేశవ్యాప్తంగా 4,416 పట్టణాలు పోటీలో ఉండగా గ్రేటర్ వరంగల్‌కు 101వ స్థానం దక్కింది. నర్సంపేట మున్సిపాలిటీలో రూ.93 కోట్లు, వర్ధన్నపేట మున్సిపాలిటీలో రూ.39 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మంత్రి కొండా సురేఖ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులకు కలెక్టర్ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

విధుల్లో ఉత్తమ ప్రతిభ కబనరిచిన 224 మంది ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు ప్రశంసపత్రాలు అందజేశారు. వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్‌యాదవ్, ఆర్డీఓ వాసుచంద్ర, ఏఓ శ్రీకాంత్, తహసీల్దార్లు నాగేశ్వర్‌రావు, ఇక్బాల్ , ఏసీపీలు బోనాల కిషన్, సతీష్‌బాబు, తిరుమల్, ఇన్‌స్పెక్టర్లు సురేష్‌గౌడ్, వెంకటేశ్వర్లు, క్రాంతికుమార్ పాల్గొన్నారు.





నృత్యం చేస్తున్న విద్యార్థినులు





ఉత్తములకు ప్రశంసలు - 8లో▸

కవులు, కళాకారులకు పుట్టినిల్లు ఓరుగల్లు

ఖిలా వరంగల్: కవులు, కళాకారులకు ఓరుగల్లు పుట్టినిల్లు అని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ ప్రావీణ్య హాజరై సీపీ అంబర్ కిషోర్ ఝా, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, మహేందర్‌జీ, టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ అరుణ్‌రెడ్డి, డీసీపీ రవీందర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. సమాజాన్ని చైతన్యం చేసే శక్తి కళలకు ఉందని అన్నారు. మంచి నైపుణ్యం గల కళాకారులు జిల్లాలో అనేక మంది ఉన్నారని తెలిపారు. దేశభక్తి, రాష్ట్ర ఆవిర్భావం ఫలాలను కళ్లకు కట్టినట్లుగా పాటలు, నృత్యాల రూపంలో కళాకారులు ప్రదర్శించారని తెలిపారు. అనంతరం విజేతలను కలెక్టర్ అభినందించారు. ఆర్డీఓ వాసుచంద్ర, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, డీఎంహెచ్ఓ వెంకటరమణ, డీపీఆర్ఓ ఎండీ అయూబ్ అలీ పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా అధికారులు





నృత్యం చేస్తున్న కళాకారులు

సైన్స్ టీచర్లకు ఆహ్వానం

- ఫిబ్రవరి 2వ తేదీ నాటికి పరిశోధన పత్రాలు పంపాలి
- 24న సైన్స్ సెమినార్ నిర్వహించనున్న ఎస్‌సీఈఆర్‌టీ
- సైన్స్ విద్య, రైజింగ్ భారత్ ప్రధానాంశాలు

కాళోజీ సెంటర్ : సైన్స్ టీచర్ల మేధస్సుకు సైన్స్ సెమినార్ ఆహ్వానం పలుకుతోంది. నూతన ఆవిష్కరణలు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనలతో సైన్స్ విద్యను పటిష్టం చేసేందుకు వైజ్ఞానిక పరిశోధన విశ్లేషణ పత్రాల సమర్పణతో టీచర్ల మేధస్సుకు పదును పెడుతున్నారు. సైన్స్ బోధనను మరింత సమర్థవంతం చేయడం, నూతన అన్వేషణ నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించేందుకు రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) ప్రతిఏటా రాష్ట్రస్థాయిలో ఒక ప్రధాన అంశం, వివిధ ఉప అంశాలపై సైన్స్ సెమినార్ నిర్వహిస్తోంది. ఈసారి కూడా నిర్వహిస్తున్న సెమినార్‌లో పాల్గొనేందుకు పరిశోధన పత్రాలను ఆహ్వానిస్తోంది. ఎంపికైనవారు ఫిబ్రవరి 24న జరిగే సెమినార్‌లో తమ పరిశోధన పత్రాలను సమర్పించాలని సూచించింది. సైన్స్ సెమినార్‌కు ఎంపిక కావడానికి పరిశోధన పత్రాలను ఫిబ్రవరి 2వ తేదీలోపు వెబ్‌సైట్‌లో పంపించాల్సి ఉంటుంది.

అంశాలు ఇవే..

ఈ ఏడాది సెమినార్‌కు సైన్స్ విద్య, రైజింగ్ భారత్‌ను ప్రధానాంశాలుగా నిర్ణయించారు. పాఠశాల విద్యలో స్టెమ్ ప్రభావం, అభివృద్ధి, సైన్స్ బోధనలో సృజనాత్మకత, పర్యావరణ చైతన్యంలో జీవవైవిధ్యం, పర్యావరణ విద్యను ప్రోత్సహించడం, పాఠశాలలను ఆవిష్కరణల కేంద్రంగా మార్చడం అనే ఉప అంశాలపై పరిశోధన పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.



సైన్స్‌సెమినార్ వెబ్ సైట్

అర్హులు వీరే..

ఉపాధ్యాయులు, టీచర్ ఎడ్యుకేటర్లు, అధ్యాపకులు, ఉపాధ్యాయ శిక్షణార్థులు, సైన్స్ విద్యకు సంబంధం ఉన్న ఎన్జీవోలు, పరిశోధకులు ఈ పత్రాలను సమర్పించాలి. పరిశోధన పత్రాల రైటప్‌లను ఇంగ్లిష్‌లో లేదా తెలుగులో ఫిబ్రవరి 2వ తేదీ వరకు పంపాలి. పూర్తి వివరాలకు టీఎస్ ఎస్‌సీఈఆర్‌టీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

పరిశోధన పత్రాలు సమర్పించాలి



సైన్స్ బోధించే ఉపాధ్యాయుల మేధస్సుకు పదును పెట్టేందుకు ఈ సెమినార్ మంచి అవకాశం. నూతన ఆవిష్కరణలు, శాస్త్రసాంకేతిక పరిజ్ఞాన పరిశోధనలతో సైన్స్ విద్యను పటిష్టం చేసేందుకు సైన్స్ ఉపాధ్యాయులు పరిశోధన పత్రాలు సమర్పించాలి. విద్యార్థులకు మెరుగైన బోధన చేయడానికి ఉపయోగపడుతుంది.సైన్స్ టీచర్స్ మంచి పరిశోధన పత్రాలను సమర్పించి ప్రతిభచాటాలి.

– డి.వాసంతి, డీఈఓ వరంగల్

సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలి

- అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ వాకడే
- కలెక్టరేట్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు

కరీమాబాద్: స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ వాకడే పిలుపునిచ్చారు. కలెక్టరేట్ ఆవరణలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించడంతోపాటు మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆమె జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దేశ చరిత్రలో జనవరి 26వ తేదీకి ప్రత్యేకత ఉందన్నారు. ప్రజలే పాలకులుగా గణతంత్ర రాజ్యంగా ఏర్పడిన రోజు అని తెలిపారు. ఆర్డీఓ వాసుచంద్ర, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, ఎన్నికల సూపరింటెండెంట్ విశ్వనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో జెండాకు వందనం చేస్తున్న అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ వాకడే

రిపబ్లిక్ డే వేడుకల్లో ఉప్పరపల్లి విద్యార్థిని

చెన్నారావుపేట: న్యూఢిల్లీలో జరిగిన రిపబ్లిక్‌డే పరేడ్‌లో ఉప్పరపల్లి హైస్కూల్ విద్యార్థిని కాసాని కీర్తిప్రసన్న, గైడ్ టీచర్ కె.మాధవి పాల్గొన్నారు. వీర్ గాథాలో విజేతగా నిలిచి నగదు బహుమతితోపాటు ప్రశంసపత్రం అందుకుని గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం వారికి వచ్చింది. పాఠశాల హెచ్ఎం జయ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న విద్యార్థిని కీర్తిప్రసన్న, గైడ్ టీచర్ మాధవి

కేయూలో నేడు ఓరియంటేషన్ ప్రోగ్రాం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో డిగ్రీ (బీకాం, బీబీఏ) అధ్యాపకులకు రిపోర్టు రైటింగ్‌పై ఈనెల 27న ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు కళాశాల బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఆచార్య కట్ల రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల సెమినార్ హాల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి వీసీ ఆచార్య తాటికొండ రమేష్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, విభాగం అధిపతి ఆచార్య ఎస్.నర్సింహాచారి, డీన్ ఆచార్య పి.అమరవాణి, ఆచార్య పి.వరలక్ష్మి, అడ్జెంట్ ఆచార్యులు కృష్ణమాచార్యులు పాల్గొంటారని పేర్కొన్నారు.

రామ్ 'ప్రోనైట్' అదుర్స్

హసన్‌పర్తి: ఎస్‌ఆర్ యూనివర్సిటీ ప్రాంగణంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న స్పార్కిల్-24 వేడుకలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు రామ్ మిర్యాల 'ప్రోనైట్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'చిట్టీ నీ నవ్వంటే, మనసు విరిచావే రాధికా'.. అంటూ రామ్ ఆలపించిన పాటకు విద్యార్థులు కోరస్ కలిపి సందడి చేశారు. గాయకుడు శ్రీనివాస్ పాటలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు మహాభారతంలోని ద్రౌపతి వస్త్రాపహరణ నాటకం ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో విజేతలకు ఎస్సార్ వర్సిటీ చాన్స్‌లర్ వరదారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.



పాట పాడుతున్న గాయకుడు రామ్ మిర్యాల

క్లుప్తంగా

గూర్ఖాకు దాతల చేయూత



రాణాకు నగదు అందజేస్తున్న దాతలు

సాక్షి స్పందన

డోర్నకల్ : డోర్నకల్‌లో గూర్ఖాగా పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన డమ్మర్ రాణా గుండె జబ్బు చికిత్స కోసం దాతలు చేయూతనందిస్తున్నారు. పేదరికానికి తోడు గుండె జబ్బు బారిన పడటం, నేపాల్ దేశస్తుడు కావడంతో రేషన్ కార్డు లేక చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేక పోవడంతో ఇటీవల సాక్షి దినపత్రికలో గూర్ఖాకు గుండె జబ్బు పేరుతో కథనం ప్రచురితం కాగా దాతలు స్పందిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం వరంగల్‌కు చెందిన న్యాయవాదులు రూ.5 వేల నగదు అందించారు. శుక్రవారం డోర్నకల్ జెడ్పీఎస్ఎస్ 2005–06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు డమ్మర్ రాణా ఇంటికి వచ్చి రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వీరబోయిన రమేష్, సీహెచ్ రవి, భూక్యా రాజేష్, ఎల్.విజయ్, జక్కుల నరేష్, ఎస్‌కె రేష్మా, ధరావత్ రేష్మా, రాధిక తదితరులు పాల్గొన్నారు.

గడ్డిమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య



గట్టయ్య మృతదేహం

మడికొండ : గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మడికొండ శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన దండింగం గట్టయ్య(70) అనారోగ్యంతో పాటు అప్పులు అధికమయ్యాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన గట్టయ్య శుక్రవారం మడికొండ శివారు ఇండస్ట్రియల్ ఏరియలో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య లచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జక్కుల రాజబాబు తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఉత్తములకు ప్రశంసపత్రాలు



ప్రశంసపత్రం అందుకుంటున్న ఎంజీఎం సూపరింటెండెంట్ వి.చంద్రశేఖర్

విధుల్లో ప్రతిభ కనబరిచిన 224 మంది ప్రభుత్వ అధికారులు, సిబ్బందితోపాటు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రశంసపత్రాలు అందుకున్నారు. గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని ఖిలావరంగల్‌లోని ఖుష్‌మహల్ మైదానంలో శుక్రవారం వారికి కలెక్టర్ ప్రావీణ్య ప్రశంస పత్రాలు ప్రదానం చేశారు. - సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, వరంగల్



జి.రాంరెడ్డి, జెడ్పీ సీఈఓ; శారద, జూనియర్ అసిస్టెంట్; ఎండీ.అయూబ్ అలీ, డీపీఆర్‌ఓ; జి.అప్పిరెడ్డి, డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేటిక్స్ ఆఫీసర్



బి.విశ్వనారాయణ, సూపరింటెండెంట్; ఎన్.రంజిత్, డీటీ; శ్రీధర్, సీసీ, కలెక్టర్; ఎల్.సురేందర్, ఆఫీస్ సబార్డినేట్; ఇక్బాల్, తహసీల్దార్, వరంగల్; వి.విజయ్‌సాగర్, తహసీల్దార్, వర్ధన్నపేట; జి.శారద, ఆర్‌ఐ; ఈ.రజిత, మండల సర్వేయర్; ఎండీ.చాంద్ పాషా, చైన్‌మెన్; వి.క్రాంతికుమార్, ఇన్‌స్పెక్టర్, మామునూరు; పి.రవికుమార్, కానిస్టేబుల్; విజయలక్ష్మి, ఆఫీస్ సబార్డినేట్



విద్యశ్రీ, సర్వేయర్; జి.సుగుణ, ఎంపీఎస్‌ఓ; టి.కుమార్, సీసీ; జి.యాకమ్మ, కానిస్టేబుల్; ఎం.సురేష్‌కుమార్, అడిషనల్ డీసీపీ; పి.అనంతయ్య, ఏసీపీ; జి.హిమబిందు, జూనియర్ అసిస్టెంట్; రవీందర్‌రాజ్, హెడ్‌కానిస్టేబుల్; జి.స్వర్ణలత, కానిస్టేబుల్; ఎన్.కృష్ణారెడ్డి, డిప్యూటీ కమిషనర్; సీహెచ్.ప్రకాశ్‌రెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్; ఎస్. శ్రీనివాస్, ఈఈ



ఎ.రమేష్, ఐటీ మేనేజర్; పి.అవినాష్, టీపీబీఓ; ఎన్.సరిత, ఏఈ; కిరణ్‌రాజ్, మెడికల్ ఆఫీసర్; బి.రమేష్, చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్; ఎం.సునీత, ఎంపీహెచ్ఏ; వి.సాయిచరణ్, అడిషనల్ డీఆర్‌డీఓ; కె.శోభాదేవి, ప్రిన్సిపాల్; సీహెచ్. సుగుణ, కుక్; ఆర్.అరుణజ్యోతి, వ్యవసాయ శాస్త్రవేత్త; వి.నరసింహారావు, ఏడీఈ; జి.మనోజ్‌లాల్, సివిల్ సర్జన్



బి.నర్సయ్య, సివిల్ సర్జన్, వర్ధన్నపేట; ఫ్లోరెన్స్ పద్మశ్రీ, నర్సింగ్ సూపరింటెండెంట్; సి.మమతారెడ్డి, ప్రొఫెసర్; రమాదేవి, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్; ఎం.ప్రదీప్‌కుమార్, డీఈ, మిషన్ భగీరథ; సీహెచ్ రవీంద్ర నాథ్, డీఈఈ; ఎం.సదానందం, ఎఫ్‌ఆర్‌ఓ, వరంగల్; పి.రవికిరణ్, ఎఫ్‌ఆర్‌ఓ, నర్సంపేట; పరశురాములు, సోషల్ వర్కర్; జి.కిషన్, ఎంపీడీఓ, రాయపర్తి; ఎన్.వీరేశం, ఎంపీడీఓ, గీసుకొండ; భాస్కర్, గన్‌మెన్

ప్రాణం మీదికి తెచ్చిన క్షణికావేశం

- సమక్క జాతరలో వర్కర్ల మధ్య గొడవ
- బార్ యజమాని బంధువు మందలింపు
- పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం
- 80శాతం కాలిన శరీరం.. పరిస్థితి విషమం

ఎస్ఎస్‌తాడ్వాయి/ఖిలా వరంగల్: విహార యాత్ర విషాదంగా మారింది. మద్యం మత్తులో వర్కర్ల మధ్య చోటుచేసుకున్న స్వల్ప ఘర్షణ.. బార్ యజమాని బంధువు మందలింపు..ఓ వ్యక్తి ఆత్మహత్యయత్నానికి దారితీసింది. ములుగు జిల్లా మేడారం జాతరలో శుక్రవారం జరిగిన ఘటన వివరాలు స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండకు చెందిన మడిపెల్లి సతీష్(28) కొంతకాలంగా వరంగల్ కరీమాబాద్‌లోని ఓ బార్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా వర్కర్ల అభ్యర్థన మేరకు శుక్రవారం తెల్లవారుజామున బార్ యజమాని ఓ వాహనంలో వర్కర్లను సమ్మక్క,సారలమ్మ దర్శనానికి పంపించారు. వారి వెంట బార్ యజమాని బంధువు కత్తి దేవేందర్ వెళ్లారు. ఉదయం అమ్మవార్ల దర్శనం అనంతరం మేక కోసి వంటలు చేసుకున్నారు. అందరు కలిసి మద్యం తాగుతుండగా.. అక్కడికి ఓ యాచకుడు రాగా.. అందరూ అతడిని తిట్టారు. తోటి వర్కర్ల తీరుపై అసహనం వ్యక్తం చేసిన సతీష్ భిక్షగాడికి రూ.50 అందజేశాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న వర్కర్లు.. సతీష్ మధ్య ఘర్షణ జరిగింది. దీంతో అక్కడే ఉన్న బార్ యజమాని బంధువు మందలించాడు. యజమాని బంధువు అయితే నన్ను తిడతావా అంటూ మనస్థాపానికి గురైన సతీష్ భోజనం చేయకుండానే బయటకు వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలిసిన పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించి 80శాతం కాలిన గాయాలైన సతీష్‌ను 108 వాహనంలో ములుగు ఆస్పత్రికి పంపించారు. వైద్యుల సూచన మేరుగైన వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు చెబుతున్నారు.



ఎంజీఎంలో చికిత్స పొందుతున్న సతీష్

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడి



పట్టుబడిన మద్యం బాటిళ్లను చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

- మద్యం స్వాధీనం, నిర్వాహకులపై కేసు

ఖిలా వరంగల్ : అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్న బెల్ట్‌షాపులపై ఆకస్మికంగా దాడి చేసి రూ.1,80,440ల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, పెండ్యాల దేవేందర్ తెలిపారు. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి శాకరాసికుంట కాలనీకి చెందిన ఎనుగందుల రాజు, మామునూరు స్టేషన్ పరిధి తిమ్మాపురం గ్రామశివారు లక్ష్మీపురానికి చెందిన నాగప్ప శివ వేర్వేరుగా తమ ఇంట్లో భారీగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్నారని సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, పెండ్యాల దేవేందర్ ఆధ్వర్యంలో వేర్వేరుగా బెల్ట్‌షాపులపై దాడి చేశారు. ఈదాడుల్లో ఎనుగందుల రాజు ఇంట్లో సుమారు రూ.1,65,160ల విలువైన మద్యం బాటిళ్లు, లక్ష్మీపురం గ్రామానికి చెందిన నాగప్ప శివ ఇంట్లో రూ.15,280ల మొత్తం రూ.1,80,440ల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని రాజు, శివపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ టి.సురేష్, మామునూరు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్‌కు వేర్వేరుగా అప్పగించారు.ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై ఈ.నర్సింహారావు, మామునూరు ఎస్సై కృష్ణవేణి, కానిస్టేబుళ్లు బాబ్ సింగ్, వీరన్న పాల్గొన్నారు. వరంగల్ మిల్స్‌కాలనీ ఏసీరెడ్డినగర్‌కు చెందిన గడ్డం రమేష్ ఇంట్లో రూ.51,680ల విలువైన మద్యం, మామునూరు గ్రామానికి చెందిన సల్లూరి రాజేందర్ ఇంట్లో నిల్వ చేసిన రూ.26,440ల విలువ చేసిన మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు.

విద్యార్థినికి చేదు అనుభవం

- బస్సుల్లో తిరగడం అమ్మాయిలకు ఫ్యాషనైందంటూ మహిళా కండక్టర్ వెటకారం

పరకాల : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సులో ప్రయాణ సదుపాయం కల్పించడం ఏమో కానీ ఓ విద్యార్థికి మహిళా కండక్టర్ నుంచి చేదు అనుభవం ఎదురైంది. నడికూడ మండలం నర్సక్కపల్లెకు చెందిన విద్యార్థిని మేఘన పరకాల నుంచి హుజురాబాద్ వెళ్లే బస్సెక్కింది. అయితే ఉచిత ప్రయాణం కావడంతో విద్యార్థిని తన వద్ద ఉన్న ఆధార్ కార్డు చూపించింది.. దీంతో మహిళ కండక్టర్ ఫొటో మార్చుకుంటే ఏమవుతుంది.. చిన్నప్పటి కార్డు ఉందా అంటూ వెటకారంగా మాట్లాడింది. కాగా తాను అప్‌డేట్ చేసుకున్నానని చెప్పిన పట్టించుకోలేదని.. అలా మాట్లాడకండి అవసరమైతే డబ్బులు తీసుకొమ్మని చెప్పింది. పైసలు ఎక్కువైనాయా.. అయిన కాలేజీ అమ్మాయిలకు పనిపాట లేకుండా బస్సులో తిరగడం ఫ్యాషనైందనడంతో బస్సులోనే ఆ విద్యార్థి కంటతడి పెట్టుకుంది. ఈ విషయాన్ని తన తండ్రికి ఫోన్‌లో తెలియజేయగా అతను పరకాల ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు డిపోకు చేరుకున్నాడు. డీఎం కొత్త బస్సుల ప్రారంభోత్సవం బిజీగా ఉండటంతో అక్కడే ఉన్న కొందరు ఆర్టీసీ ఉద్యోగులు మరోసారి అలా జరగకుండా చూసుకుంటామంటూ నచ్చజెప్పారు. అయితే ఓ వైపు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కొత్త బస్సులు ప్రారంభిస్తుండగా ఈ సంఘటన జరగడం విశేషం. ఈ విషయంపై ఆర్టీసీ డీఎం రవిచంద్ర దృష్టికి సాక్షి తీసుకెళ్లగా ఆధార్ అప్‌డేట్ చేసుకొమ్మని చెప్పడంలో తప్పులేదన్నారు. బాలిక ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

నేటినుంచి అన్నారం దర్గా ఉర్సు

- మూడు రోజుల పాటు సాగనున్న ఉత్సవాలు
- రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తుల రాక



విద్యుత్ దీప కాంతుల్లో దర్గా

పర్వతగిరి : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో హజ్రత్ సయ్యద్ యాకూబ్ షావలి బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు నేటినుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి దర్గాను దర్శనం చేసుకోనున్నారు. ఉర్సు ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు(శనివారం) రాత్రి ఖవ్వాలి గేయాలాపన, గంధం ఊరేగింపు, రెండో రోజు (ఆదివారం) దీపారాధన, భక్తులకు మహా అన్నదానం, మూడో రోజు(సోమవారం) ఖత్మల్ ఖురాన్‌లతో ఉత్సవాలు ముగుస్తాయి. దర్గాకు ముస్లింలతో పాటు హిందువులు హాజరై మొక్కులు చెల్లించుకుంటారు.

ఉత్సవాలకు నిధుల మంజూరు



అన్నారం దర్గా ఉర్సు ఉత్సవాలకు తెలంగాణ వక్ఫ్‌బోర్డు నుంచి రూ.7.10లక్షలు మంజూరయ్యాయి. దర్గాతో పాటు చిల్లాల పెయింటింగ్, తాగునీరు, శానిటేషన్, మరుగుదొడ్లతో పాటు అన్నదానం, ఇతర సదుపాయాలకు కేటాయించి ఏర్పాట్లు పూర్తి చేశాము.

-రియాజ్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్

భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తాం..



అన్నారం దర్గా ఉర్సు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తాం. యాకూబ్ బాబా అనుగ్రహంతో ప్రతీ ఏటా బాబాకు గంధం సమర్పించేందుకు ముజేవార్ల ఇంటి నుంచి గంధాన్ని తీసుకెళ్తారు. గంధం తీసుకెళ్లే సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి దర్గాలో గంధం సమర్పిస్తాం.

-ఖాజాపాషా, ముజేవార్

పోలీసుల బందోబస్తు



గంధం ఊరేగింపునకు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశాం. భక్తులను క్యూలో నిలబెట్టడానికి, ట్రాఫిక్ మళ్లింపు, వాహనాల పార్కింగ్, దొంగతనాల నివారణకు క్రైం పార్టీ, గంధం ఊరేగింపునకు స్పెషల్ పార్టీ పోలీసులు విధులు నిర్వహిస్తారు. దర్గా వద్ద కంట్రోల్ రూం ఏర్పాటు చేసి బందోబస్తు పర్యవేక్షణ చేయడం జరుగుతుంది. భక్తులు, ఉత్సవ నిర్వాహకులు, పోలీసులకు సహకరించాలి.

- వీరభద్రరావు, ఎస్సై, పర్వతగిరి

16 కిలోల గంజాయి స్వాధీనం

- నిందితుడి అరెస్ట్



నిందితుడితో పాటు పట్టుబడిన గంజాయిని చూపుతున్న సీఐ చంద్రమోహన్

కాజీపేట : కాజీపేట రైల్వే జంక్షన్‌లో అనుమానస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని తనిఖీ చేయగా అతని వద్ద 16కిలోల ఎండుగంజాయి లభ్యమైందని ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ తెలిపారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. రైలు ద్వారా ఒడిశా రాష్ట్రం నుంచి నిషేధిత గంజాయి రవాణా చేస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు శుక్రవారం రైల్వే స్టేషన్‌లో మకాం వేసి నిందితుడు సూర్యనారాయణను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. గంజాయిని సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు. సమావేశంలో ఎస్సై తిరుపతి, హెడ్‌కానిస్టేబుల్ ఖలీల్, కోటి, వీరమల్లు, రవీందర్, లాలయ్య, ఆయుబ్ పాల్గొన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడి మృతి



గోపాల్ (ఫైల్)

చిల్పూరు: మండలంలోని పల్లగుట్టకు చెందిన గీతకార్మికుడు ఉమ్మగోని గోపాల్(52) శుక్రవారం వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకుజారి కిందపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై వినయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. గీత వృత్తే ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్న గోపాల్ రోజు మాదిరిగానే కల్లు గీసేందుకు వెళ్లాడు. చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మోకు జారడంతో కిందపడి తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. కాగా కల్లు గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గణగోని రమేష్, గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడు చిర్ర నాగరాజు, వెంకటేశ్వర్లుతో పాటు పలువురు నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరఫున రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని వారు కోరారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్..



సురేష్(ఫైల్)

నర్సింహులపేట : మండలంలోని బొజ్జన్నపేట గ్రామ పరిధిలో శుక్రవారం ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో డ్రైవర్ మృతిచెందాడు. ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలంలోని సింగారం గ్రామానికి చెందిన చెరుకు సురేష్(30) బొజ్జన్నపేట గ్రామ పరిధి నుంచి ట్రాక్టర్లో మట్టిని తరలిస్తున్నాడు. ఈక్రమంలో కాల్వ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో సురేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య శ్రావణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు.